సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 4 | డిసెంబర్ | 2024



హరీశ్‌కు కన్నీటి వీడ్కోలు..

వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. - 8లో▸



రోజంతా పడిగాపులు..

చెల్పాక ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం వేళ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేయిస్తంభాల దేవాలయ ఆదాయం రూ.13,99,355

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం నెలవారీ (కార్తీకమాసం) హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా రూ.7,37,854, పూజా రుసుముల ద్వారా రూ.6,61,501, మొత్తం రూ.13,99,355 ఆదాయం వచ్చినట్లు ఈఓ కె. వెంకటయ్య తెలిపారు. ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, మధుకర్, లింగబత్తుల రామకృష్ణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ఎంజీఎం : మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. కాకతీయ మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్స్, పోష్ యాక్ట్, సైబర్ క్రైమ్‌పై మెడికోలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తులతో వ్యక్తిగత వివరాల పంచుకోవద్దని సూచించారు. అనంతరం నార్కోటిక్స్ డీఎస్పీ సైదులు మెడికోలతో మత్తు రహిత సమాజాన్ని నిర్మించడానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి



హన్మకొండ అర్బన్ : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేష్‌బాబు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలకు వైద్యపరమైన అవసరాలు, వారికి శిక్షణను పెంపొందించే పరికరాలను అందిస్తామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు తమవంతు న్యాయసహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మల్లికాంబ సంస్థ బాధ్యులు బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, కోడం కళ్యాణ్, యాదగిరి, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

83 పాఠశాలల్లో నేడు న్యాస్

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన 83 పాఠశాలల్లో 3,6,9 తరగతుల విద్యార్థులకు బుధవారం నేషనల్ అచీవ్‌మెంటు సర్వే (న్యాస్) నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హనుమకొండ డైట్, బీఈడీ కళాశాలలనుంచి ఛాత్రోపాధ్యాయులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించారు. ఈ సర్వేకు వచ్చే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు హెచ్ఎంలు సహకరించాలని డీఈఓ డి.వాసంతి ఆదేశాలు జారీచేశారు. సీబీఎస్ఈ తరఫున ప్రతీ పాఠశాలకు ప్రత్యేక పర్యవేక్షకులను నియమించారు.

డిగ్రీ పరీక్షల్లో 42మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల్లో మంగళవారం నిర్వహించిన మొదటి, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ స్క్వాడ్లకు పట్టుబడి 42 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. వరంగల్ జిల్లాలో ఒకరు, ఆదిలాబాద్‌లో 35మంది, ఖమ్మం జిల్లాలో ఆరుగురు మొత్తంగా 42మంది విద్యార్థులు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిశోర్ ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఆర్‌బీ నుంచి అటాచ్‌పై మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న జి.శ్రీదేవిని వెస్ట్ జోన్ పరిధిలోని తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌కు, నల్లబెల్లి ఎస్సై టి.ప్రశాంత్‌బాబును గీసుకొండ ఎస్సైగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కరీనా, శంకర్ ఆగయా..!

కాకతీయ జూపార్క్‌కు జంట పెద్ద పులులు

- రానున్న మరో రెండు అడవి దున్నలు
- ఐదేళ్ల నిరీక్షణకు తెర..
- త్వరలో ప్రారంభించనున్న మంత్రి సురేఖ



శంకర్(10)మగపులి



కరీనా(15)ఆడపులి

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని కాకతీయ జూపార్క్‌కు ఆడపులి కరీనా (15), మగ పులి శంకర్ (10) వచ్చేశాయి. పర్యాటకులు ఎప్పుడెప్పుడా అని ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న పెద్దపులుల దర్శన భాగ్యం త్వరలో కలగనుంది. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా రెండు పెద్ద పులుల తోపాటు అడవిదున్నల ఎన్‌క్లోజర్‌లు, రెండు జింకల ఎన్‌క్లోజర్‌లను ప్రారంభించనున్నట్లు అటవీశాఖాధికారులు తెలిపారు.

ఐదేళ్ల కిందటే రావాల్సి ఉండే..

కాకతీయ జూపార్క్‌లో పెద్ద పులులు, అడవిదున్నల కోసం ఐదేళ్ల క్రితమే ఎన్‌క్లోజర్ పనులు ప్రారంభించారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోకపోవడం.. బడ్జెట్ లేదనే నెపంతో పనులను మధ్యలోనే వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అటవీశాఖ మంత్రి కావడంతో జూపార్క్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్‌క్లోజర్‌ల పనులు పూర్తి చేసి రెండు పెద్ద పులులు, ఇతర జంతువులు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

హగ్ డీర్.. బార్‌కిన్ డీర్ వైజాగ్ నుంచి రాక..

కాకతీయ జూపార్క్‌కు రెండు జింక (హగ్ డీర్, బార్‌కిన్ డీర్)లను ఆంధ్రప్రదేశ్‌నుంచి తీసుకొచ్చినట్లు అటవీశాఖాధికారులు తెలిపారు. రెండు అడవిదున్నలు త్వరలో రానున్నట్లు చెప్పారు. సెంట్రల్ జూపార్క్ అథారిటీ అనుమతితో ఈ జంతువులను జూపార్క్‌కు తీసుకొస్తున్నట్లు వివరించారు. వాటి కోసం ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌ల ఏర్పాటు చేశామన్నారు.

సిద్ధసముద్రంలో పూడిక తీస్తే మేలు..

జూపార్క్... సిద్ధ సముద్రం చెరువు ప్రాంతంలో చుట్టూ ఎత్తయిన కొండల మధ్య 47.64 ఎకరాల్లో విస్తీర్ణం కలిగి ఉంది. ఇందులో వివిధ జంతువుల ఎన్‌క్లోజర్‌లకు పోను సిద్ధసముద్రం చెరువు కొంతమేర ఉంటుంది. అప్పట్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చెరువులో పూడిక తీసి బోటింగ్ సౌకర్యం కల్పిస్తామని పార్క్‌ను సందర్శించిన సందర్భంగా తెలిపారు. ఆ తరువాత పట్టించుకోలేదు. కొండా సురేఖ అటవీశాఖ మంత్రి కావడం, జూపార్క్‌కు ప్రతేక నిధులు కేటాయించి సిద్ధసముద్రంలో పూడిక తీసి బోటింగ్ సదుపాయం కల్పించాలని పర్యాటకులు, నగరవాసులు కోరుతున్నారు.

ఇక్కడి వాతావరణానికి అలవాటు పడాలి..

కాకతీయ జూపార్క్‌కు రెండు పెద్ద పులులు వచ్చాయి. రెండు జింకలు వైజాగ్ నుంచి ఇటీవల తీసుకొచ్చాం. రెండు అడవిదున్నలు త్వరలో రానున్నాయి. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేదాక సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. ఆ తరువాత సందర్శకులకు అనుమతిస్తాం.

– భీమానాయక్,
అటవీ ముఖ్య సంరక్షణాధికారి, భద్రాద్రి సర్కిల్

ఆదాయంపై గురి!

వరంగల్ ఓసిటీలోని ప్లాట్ల విక్రయానికి 'కుడా' చర్యలు

- 117 ఎకరాల్లో సకల సౌకర్యాలతో ప్లాట్లు సిద్ధం
- 50 ప్లాట్లు.. రూ.70 కోట్లు
- ఈనెల 15న వేలానికి అన్ని ఏర్పాట్లు



సాక్షి, వరంగల్:

ఆదాయం పెంచుకునేందుకు 'కుడా' (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే నగరంలో పలుచోట్ల కొత్తగా హోర్డింగులు ఏర్పాటు చేయగా.. పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించింది. మరోవైపు ప్లాట్లు విక్రయిస్తూ నిధుల సేకరణపై దృష్టి సారించింది. గతేడాది యునీ సిటీ పేరిట వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించగా.. నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. ఈనేపథ్యంలో ఈనెల 15న ఓ సిటీ సమీపంలో ఓపెన్ ప్లాట్లు విక్రయించేందుకు సిద్ధమవుతోంది.

గజానికి రూ.30 వేలు..

కొత్తగా నిర్మితమవుతున్న వరంగల్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, రైల్వే స్టేషన్‌కు సమీపంలోని ఓసిటీలో ఆసంస్థ అభివృద్ధి చేసిన 117 ఎకరాల్లోని ఓపెన్ ప్లాట్లను ఈనెల 15న వేలం వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 200 గజాలు, 300 గజాలున్న 50 రెసిడెన్షియల్ ప్లాట్ల వేలం ద్వారా రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆప్లాట్లలోని పిచ్చి మొక్కలు, రాళ్లను తొలగించి మళ్లీ హద్దులు వేసే పనిని వేగిరం చేశారు. ఈనెల 5న వేలానికి సంబంధించిన ప్లాట్ల వివరాలతో కూడిన బ్రోచర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. 'కుడా' కార్యాలయంలో రూ.100 చెల్లించి ఈ బ్రోచర్‌ను పొందే కొనుగోలుదారులు ఓసిటీలో జరిగే వేలంలో పాల్గొనేందుకు 'కుడా' వైస్ చైర్మన్ పేరున రూ.25,000ల డీడీ తీయాలని అధికారులు చెబుతున్నారు. గజానికి రూ.30 వేలు అప్ సెట్ ధరను అధికారులు నిర్ణయిస్తున్నా.. అందుకు రెట్టింపు, మూడింతల విక్రయం జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓసిటీ ప్లాట్ల వేలం ద్వారా మళ్లీ రియల్ భూం పెరిగే అవకాశం ఉండడంతో నగర శివారుల్లో మరికొన్ని కొత్త లేఔట్లను అభివృద్ధి చేసి ఆదాయం పెంచుకోవడం ద్వారా నగరాభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే వరంగల్ అత్యాధునిక బస్టాండ్ నిర్మాణ పనులు 'కుడా' ఆధ్వర్యంలోనే జరుగుతున్న సంగతి తెలిసిందే.

13వ సారి..

ఓసిటీని 117 ఎకరాల్లో 'కుడా' అధికారులు అభివృద్ధి చేశారు. ఆధునిక ఇంటిగ్రేటెడ్ ఏకో ఫ్రెండ్లీ టౌన్‌షిప్, 150, 80, 50, 40 ఫీట్ల విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇక్కడి ప్లాట్లకు యమ డిమాండ్ ఏర్పడింది. చివరిసారిగా 2023 జూన్ 25న జరిగిన 12వ విడత వేలంలో రెసిడెన్షియల్ ప్లాట్లలో గజానికి రూ.85,500 అత్యధిక ధర పలికింది. 'కుడా' అధికారులు 42 ప్లాట్లకు వేలం నిర్వహించగా.. 40 ప్లాట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఇప్పుడు కూడా అదే తరహా పోటీ ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. భూముల ధరలు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో మధ్య తరగతి ప్రజల నుంచి భారీగా స్పందన వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఓసిటీ తర్వాత మడిపల్లిలో మాసిటీ పేరుతో రెండో వెంచర్‌ను అభివృద్ధి చేశారు. అక్కడా తొలి విడత వేలంలో 50 ప్లాట్ల అమ్మకానికి వేలం పెట్టారు. వీటిలో 42 ప్లాట్లను విక్రయించారు. మాసిటీలో ప్లాట్ల వేలానికి వచ్చిన స్పందన చూసి ఉనికిచర్ల ఔటర్‌రింగ్ రోడ్డుకు సమీపంలో 'యునీసిటీ' పేరిట మూడో వెంచర్‌ను అభివృద్ధి చేయడంతో అక్కడా గతేడాది 50 ప్లాట్లకు వేలం వేయగా.. అనూహ్య స్పందన వచ్చిన సంగతి తెలిసిందే.

మనో సంకల్పం ముందు వైకల్యం చిన్నది

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: మనో సంకల్పం ముందు వైకల్యం చాలా చిన్నదని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైకల్యం ఉందని బాధపడవద్దని, భవిష్యత్‌పై దృష్టి సారించి జీవితాన్ని మలుచుకోవాలన్నారు. ఉపాధి రంగాల్లో రాణించాలనుకునే వారు ఓబీఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగం ఆశించే వారు ఉపాధి శిక్షణ అధికారి పోర్టల్‌లో సంప్రదించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సౌకర్యార్థం ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో ర్యాంపులు నిర్మిస్తున్నామన్నారు. జిల్లా సంక్షేమాధికారి జె.జయంతి మాట్లాడుతూ ప్రీ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు, స్వయం ఉపాధి పథకాలు, వివాహ ప్రోత్సాహకం, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ, దివ్యాంగుల ఉపాధి అవకాశాలపై వివరించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఇటీవల జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో విజేతలైన దివ్యాంగులకు కలెక్టర్ ప్రావీణ్య బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు దర్శన్‌సింగ్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి, డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డీఆర్‌డీఓ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

లంచం అడిగితే ఏసీబీని సంప్రదించండి..

హన్మకొండ అర్బన్ : ఏ ప్రభుత్వ అధికారైనా మీ పని చేసేందుకు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 సమాచారం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య ప్రజలకు సూచించారు. ఏసీబీ వారోత్సవాల్లో భాగంగా రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఆవిష్కరించారు. ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు మామునూరు అనుకూలం

ఆర్కిటెక్ డీజీఎం మల్లిక

వరంగల్: ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మామునూరు అనుకూలంగా ఉందని ఆర్కిటెక్ డీజీఎం మల్లిక, సివిల్ ఇంజనీర్ ఏజీఎంలు జి.నటరాజ్, శ్రీనివాస్‌భార్గవ్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ఎయిర్‌పోర్ట్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్ పనులపై ఆప్టికల్ సర్వే నిర్వహించేందుకు నిపుణుల బృందం ఢిల్లీ నుంచి వచ్చిందని తెలిపారు. అనంతరం ఆర్కిటెక్ డీజీఎం మల్లిక మాట్లాడుతూ మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే వరంగల్ సమీప ప్రాంతాలు పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై నివేదికలు అందించారని చెప్పారు. సమావేశంలో వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, సర్వే ల్యాండ్ ఏడీ భోజరాజు, అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అర్బన్ డే వేడుకలు

కేఎంసీ నుంచి బల్దియా వరకు 2కే రన్

- ఇండోర్ స్టేడియంలో వైద్యశిబిరం
- రూ.9కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు



మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు ఇస్తున్న అతిథులు



2కే రన్‌లో మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది

వరంగల్ అర్బన్/హన్మకొండ అర్బన్: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలో బల్దియా ఆధ్వర్యంలో అట్టహాసంగా అర్బన్ డే వేడుకలు జరుపుకున్నారు. ఉదయం కాకతీయ మెడికల్ కళాశాల వద్ద 2 కే రన్‌ను మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు జెండా ఊపి ప్రారంభించారు. ఎంజీఎం జంక్షన్ మీదుగా బల్దియా ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంజీఎం జంక్షన్‌లోని పారిశుద్ధ్య కార్మికుల విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా ఫొటోలు దిగారు. అనంతరం బల్దియా ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో పారిశుద్ధ్య కార్మికులకు ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా మందులు, పీపీఈ కిట్లు, మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేశారు. అనంతరం కాశిబుగ్గ, కాజీపేట సర్కిళ్ల పరిధిలో రూ.9కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రజా పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగరాభివృద్ధికి రూ.6వేల కోట్ల నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అర్బన్ డే వేడుకల్లో భాగంగా రాత్రి స్థానిక కాళోజీ కళాక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా స్వయం సహాయక బృందాలకు, వీధి వ్యాపారులకు, ఇందిర మహిళా శక్తి నిర్వాహకులకు రూ.8.79కోట్ల విలువైన బ్యాంక్ లింకేజీ చెక్కులను మేయర్ సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కమిషనర్ వాకడే చేతులమీదుగా అందజేశారు. వివిధ శాఖల సిబ్బందిని సన్మానించారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, సురేష్ జోషి, వస్కుల బాబు, బస్వరాజు కుమారస్వామి, మామిండ్ల రాజు, సిరంగి సునీల్ కుమార్, తూర్పాటి సులోచన, జన్నుషీబారాణి, రావుల కోమల, అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డీఆర్వో వైవీ గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



దివ్యాంగురాలికి సర్టిఫికెట్ అందజేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

ఎంజీఎం: దివ్యాంగులు మనోధైర్యంతో సాధించలేనిది ఏది ఉండదని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేఎంసీలోని ఎన్ఆర్ఐ హాల్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ దివ్యాంగులను గౌరవంగా చూసుకోవడం మన బాధ్యత అని, వారికి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని డీవైఎస్ఓ సత్యవాణిని ఆదేశించారు. జిల్లాకు చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తి పతకాలు తీసుకొచ్చినట్లుగానే.. మిగిలిన పిల్లలకు క్రీడలపై ఆసక్తి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఇటీవల జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీపీ రవీందర్, డీఎస్ఓ కిష్టయ్య, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఆర్ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, జిల్లా కమిటీ సభ్యులు అంబాటి రాజేందర్, చక్రపాణి, సతీశ్, భరత్, సునీత, నరసమ్మ, వీరన్న, రాజు, రవీందర్ రావు పాల్గొన్నారు.

అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

వరంగల్: వరంగల్‌ను అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. ఏసీబీ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు పాల్గొన్నారు.

వరంగల్ తహసీల్దార్ కార్యాలయ తనిఖీ


వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సత్య శారద మంగళవారం తనిఖీ చేశారు. కలెక్టర్ కార్యాలయాన్ని మొత్తం కలియదిరుగుతూ సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది వివరాలతోపాటు వారు ఏ విధులు నిర్వర్తిస్తున్నారని తహసీల్దార్ ఇక్బాల్‌ను అడిగి తెలుసుకున్నారు. భద్రపరిచిన రికార్డులు, వీడియో కాన్ఫరెన్స్, రిజిస్ట్రేషన్ గదులను పరిశీలించారు. పనుల కోసం వచ్చిన ప్రజలను నేరుగా కలిసిన కలెక్టర్ సిబ్బంది పనితీరు గురించి ప్రశ్నించారు. కార్యాలయం చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. డీటీ సుమన్, ఏఎస్ఓ వెంకన్న, ఆర్ఐలు కృష్ణమూర్తి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

దేవాలయ భూముల సర్వే షురూ

వరంగల్: నగరంలోని పద్మాక్షి, సిద్ధేశ్వర, రంగనాయకస్వామి, వీర పిచ్చమాంబమాంబ, వేణుగోపాలస్వామి దేవాలయాల భూములను అధికారులు మంగళవారం సర్వే చేశారని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. అధికారుల సర్వేతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు చేసిన భూకబ్జా ధ్రువీకరణ, ఫిర్యాదుల నమోదు కొలిక్కి వచ్చినట్లేనని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్ భూకబ్జా విషయాన్ని ఇంకా తేల్చాల్సి ఉందన్నారు. చుట్టు పక్కల ఉన్న భూముల కొనుగోలులో వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

రామన్నపేట: ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ నాయకులు మంగళవారం వరంగల్‌లో చార్జ్‌షీట్ విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం అంటూ రూ.1.40 లక్షల కోట్లు దుర్వినియోగం చేస్తే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పేరుతో కోట్ల దుర్వినియోగానికి తెరలేపారని ఆరోపించారు. కొండా సురేఖ మంత్రిగా ఉన్నా కేఎంసీ, ఎంజీఎంలో కనీస వసతులు కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నెలకోసారి క్యాంపు కార్యాలయానికి వస్తున్న మంత్రికి సామాన్యులు సమస్యలు చెప్పుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, అరూరి రమేశ్, నాయకులు ప్రదీప్‌రావు, రత్నం సతీశ్‌షా, జలగం రంజిత్, బన్న ప్రభాకర్, తాబేటి వెంకట్, కుసుమ సతీశ్, బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, రాణా ప్రతాప్ రెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గురుకులం బాట అడ్డగింత

పలువురు నాయకుల అరెస్ట్.. స్టేషన్‌కు తరలింపు



రాకేష్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మడికొండ: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు గురుకులం బాటలో భాగంగా ఆ పార్టీ నాయకులు మంగళవారం మడికొండలోని బాలుర గురుకులంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి తోపాటు పలువురు కార్యకర్తలు మంగళవారం ఉదయం 7 గంటలకు మడికొండ శివారులోని వర్ధన్నపేట (బాలుర)గురుకులంలోకి వెళ్లేందుకు రాగా అనుమతి లేదని ప్రిన్సిపాల్ స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్, సిబ్బందితో అక్కడికి చేరుకొని నాయకులతో మాట్లాడారు. అయినా వినకపోవడంతో వారిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ గురుకులాల్లో సమస్యలను తెలుసుకోవడానికి వస్తే ఆపడం విడ్డూరంగా ఉందన్నారు. గురుకులాలు బాగుపడే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంబడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధికారెడ్డి, రవినాయక్, నాయకులు ఎశబోయిన పురుశోత్తమ్, పాలమాకుల కొమురయ్య, పల్లపు అశోక్, పిన్నింటి విజయ్‌కుమార్, గూడ హరీష్, గువ్వ రాజేష్, వస్కుల దేవేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యమకారులు ఐక్యత చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

హన్మకొండ : స్వరాష్ట్ర, స్వపరిపాలన, నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో రాష్ట్రాన్ని పాలించుకుందామని తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సందెల సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సంఘం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముందు ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయాల పై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నామని, ఉద్యకారులు కలిసి వచ్చి ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. తొలిదశ ఉద్యమంలో 369 మంది అమరులు కాగా, మలి దశలో 1300 మంది అమరులయ్యారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గుర్రం రఘు, బాబు, కాశబోయిన యాకన్న, ఇమ్మడి రవీందర్, గజ్జి సంతోశ్, ముద్దసాని వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి నరసింహారెడ్డి, సమ్మన్న, కక్కెర్ల వెంకన్న, ఎర్రవెల్లి దండయ్య, రమేశ్, శంకర్‌రావు, కోదండరాం, పరశురాములు, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

ఊడిన గూడ్స్ రైలు లింక్

● పట్టాలపై నిలిచిన బోగీలు



పట్టాలపై నిలిచి ఉన్న గూడ్స్ రైలు బోగీలు

మహబూబాబాద్ రూరల్ : గూడ్స్ రైలు బోగీల లింక్ ఊడిపోవడం (అన్ కప్లింగ్)తో వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు పట్టాలపై నిలిచాయి. ఫలితంగా రైలు రెండు భాగాలుగా విడిపోయింది. ఈ ఘటన మంగళవారం ఉదయం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డోర్నకల్ వైపు నుంచి కాజీపేట వైపునకు మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా అప్ లైన్‌లో ఓ గూడ్స్ రైలు వెళ్తోంది. ఈ క్రమంలో గేట్ క్యాబిన్ సమీపంలో లింక్ ఊడిపోవడంతో సదరు గూడ్స్ రైలుకు వెనుక భాగంలో ఉన్న మూడు బోగీలు పట్టాలపై నిలిచాయి. గూడ్స్ రైలు రెండు భాగాలుగా విడిపోయిన విషయాన్ని గమనించిన గార్డు వెంటనే లోకో పైలట్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే నిలిపివేశాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేసి గూడ్స్ రైలును పంపించారు. కాగా, 45 నిమిషాలపాటు బోగీలు పట్టాలపై నిలిచిపోవడంతో ఎగువ మార్గంలో వెళ్లాల్సిన పలు రైలు ఆలస్యంగా నడవగా ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు.

నేటినుంచి 'రైల్వే' ఎన్నికలు

పోస్టర్లమయంగా రైల్వే కాలనీలు

- హోరాహోరీగా ఫ్లెక్సీల ప్రచారం
- నేటినుంచి మూడు రోజులపాటు పోలింగ్
- కాజీపేటలో 3 వేల పైచిలుకు ఓటర్లు
- ఐదు పోలిగ్‌బూత్‌ల ఏర్పాటు



కాజీపేట జంక్షన్ ఎదుట నాయకుల ఫ్లెక్సీలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో రైల్వే ఎన్నికల కోలాహలం నెలకొంది. నేటినుంచి మూడు రోజుల పాటు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రైల్వే ట్రేడ్‌యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్ల హోరు చూస్తుంటే రాజకీయ ఎన్నికలను తలపిస్తున్నాయి. ఎన్నడు లేని విధంగా రైల్వే జంక్షన్ ప్రాంగణం, రైల్వే కాలనీల్లో రైల్వే నాయకుల ఎన్నికల పోస్టర్లు పోటాపోటీగా దర్శనమ్మివడంతో అందరు షాక్ అవుతున్నారు. రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాన్ని మైమరమించేలా రైల్వే ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుందని అటు రైల్వే కార్మికులు ఇటు ప్రజలు బాహటంగా చెప్పుకుంటున్నారు.

ఎన్నికలు ఇలా..

రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక్ సంఘ్, ఐఆర్‌ఎంయూ, ఆర్‌ఎంయూ దక్షిణ మధ్య రైల్వేలో పోటీ చేస్తున్నాయి. డిసెంబర్ 4, 5వ తేదీన జనరల్ పోలింగ్, 6వ తేదీన రన్నింగ్ స్టాఫ్‌కు పోలింగ్ ఉంటుంది. రైల్వేశాఖలో గుర్తుంపు కోసం వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలో 30 లేక 35 శాతం ఓటింగ్ వచ్చిన రైల్వే సంఘానికి ప్రధాన గుర్తింపు లభిస్తుంది. గతంలో 2007లో, 2013లో ఈ ఎన్నికలు జరుగగా ఇప్పుడు 2024లో జరుగుతున్నాయి. కాజీపేట జంక్షన్‌లో వివిధ రైల్వే డిపోలలో పని చేస్తున్న వారితో కలుపుకుని మొత్తం 3 వేలకు పైచిలుక ఓటర్లు ఉన్నారని, కాజీపేటలో ఐదు పోలిగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు రైల్వే నాయకులు తెలిపారు. కాగా, కార్మికులను కాకా పట్టడానికి రైల్వే నాయకులు పలు చోట్ల గిఫ్టులు, పార్టీలు, వాట్సాప్ గ్రూప్‌ల ప్రచారం, మద్యం పంపిణీతో గాలం వేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కొందరు వాట్సాప్‌లో నీవెంత అంటే నీవెంత అని తిట్ల పురాణం చేసుకుటున్నారని అంటున్నారు. మూడు రోజుల జరిగే ఎన్నికల సమరానికి ఐక్యతతో ఉండే కార్మికులు అంతర్యుద్ధాల వరకు వెళ్లొద్దని, అలాంటి వాటికి పులిస్టాప్ పెట్టాలని పలువురు రైల్వే రిటైర్డ్ నాయకులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా కార్మికులకు సేవ చేసే రైల్వే నాయకులు కార్మికుల గుండెల్లో మంచి స్థానాన్ని సంపాదించుకునేలా హుందాగా ఉండి కార్మిక విలువలు, నైతిక బాధ్యతతో ఆదర్శంగా ఉండాలని పలువురు సీనియర్స్ అంటున్నారు.

పోలీసుల అదుపులో రాయపర్తి ఎస్‌బీఐ చోరీ నిందితులు?

- వాహన యజమానితోపాటు మరొకరికి సంకెళ్లు
- వీరిచ్చిన సమాచారంతోనే కొలిక్కి వస్తున్న కేసు
- త్వరలోనే మిగిలిన నిందితులతో అరెస్టు ప్రకటించే అవకాశం

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో 19 కిలోల బంగారం చోరీ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు రెండు వారాలయ్యాక కాస్త పురోగతి సాధించారు. ఈ నేరానికి ఉపయోగించిన వాహన యజమానితోపాటు మరొకరిని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ సరిహద్దులో ప్రత్యేక బృందాలు అదుపులోకి తీసుకొని మంగళవారం వరంగల్‌కు తీసుకొచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. గత నెల 18న అర్ధరాత్రి దాటాక రాయపర్తి ఎస్‌బీఐలో 19 కిలోల బంగారం ఎత్తుకెళ్లినట్టుగా భావిస్తున్న మరో నలుగురు నిందితుల ఆచూకీని కనుగొన్న ప్రత్యేక బృందాలు వారు చోరీ చేసిన బంగారాన్ని రికవరీ చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టుగా తెలిసింది. ఘటనా స్థలి వద్ద లభించిన ఆక్సిజన్ సిలిండర్‌తోపాటు చోరీ సొత్తుతో రాయపర్తి నుంచి ఖమ్మం హైవే మీదుగా వెళ్లే సమయంలో సీసీ టీవీ కెమెరాలకు చిక్కిన వాహన నంబర్, ఘటనాస్థలిలో లభించిన మరిన్ని శాస్త్రీయ ఆధారాలతో పాత నేరస్తుల పనే అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కర్ణాటక, తమిళనాడు, యూపీ, మధ్యప్రదేశ్ పోలీసులతో సంప్రదింపులు జరిపారు. ఇక్కడ చోరీ జరిగిన విధానాన్ని బట్టి అక్కడ జరిగిన చోరీల విధానం తెలుసుకోవడంతో ఈ కేసుపై క్లారిటీ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన 19 ప్రత్యేక బృందాలు ఆయా రాష్ట్రాల్లో తిరిగి ఆ ముఠా కదలికలపై ఆరా తీసినట్టు తెలిసింది. టెక్నికల్ బృందం ఇచ్చిన ప్రత్యేక సహకారంతోనే ఈ కేసులో కీలకంగా ఉన్న వాహన ఆచూకీని ఉత్తరప్రదేశ్ సరిహద్దులో కనుగొని ఆ వాహన యజమానితోపాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. వీరిచ్చిన సమాచారం ఆధారంగానే ఈ కేసు కొలిక్కి వచ్చినట్టుగా తెలిసింది. ఇటీవల రాచకొండ పోలీసులు, కర్ణాటక పోలీసులు రాయపర్తిలోని చోరీ జరిగిన బ్యాంక్‌ను పరిశీలించి వెళ్లాక కేసు దర్యాప్తులో వేగిరం పెరిగింది. ఆ ఇద్దరు నిందితులను పట్టుకోవడంతో వరంగల్ పోలీసులు కాస్త ఉపశమనం పొందినట్టుగా కనిపిస్తోంది. బంగారం రికవరీ అయ్యాకనే నిందితులను మీడియా ముందుకు తీసుకొచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

రేపు డీఈఈసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

విద్యారణ్యపురి: డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్‌ఇ)లలో అర్హత సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యర్థుల్లో ఇంతకు ముందు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ హాజరుకాని వారు ఈనెల 5న(గురువారం) హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలకు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వెంట దరఖాస్తు ఫామ్, హాల్‌టికెట్, డీఈఈసెట్ 24 ర్యాంకు కార్డు, టెన్త్‌తోపాటు తదితర విద్యార్హతల సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. అభ్యర్థులు ఈరెండో దశలో వెబ్ ఆప్షన్లకు ఈనెల 7 నుంచి 9వ తేదీవరకు ఇవ్వాల్సింటుంది. రిజర్వేషన్ మెరిట్ ప్రాతిపదికన ఈనెల 13న సెకండ్ ఫేజ్‌లో భాగంలో స్లైడింగ్, ఫ్రెష్ అభ్యర్థులకు కూడా సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత కళాశాలలో ఈనెల 18నుంచి 21వ తేదీ వరకు రిపోర్టు చేయాల్సింటుందన్నారు.

బీ–కేటగిరీ సీట్లలో అడ్మిషన్ల ప్రక్రియ ఇలా..

బీ–కేటగిరీ సీట్లు భర్తీచేసే సమయంలో ప్రైవేట్, మైనార్టీ డైట్ కళాశాలల యాజమాన్యాలు ఈనెల 5న నోటిఫికేషన్ జారీచేస్తాయని తెలిపారు. ఈనెల 7నుంచి 9వతేదీవరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల సర్టిఫికెట్లు, దరఖాస్తులను డైట్ ప్రిన్సిపాల్ ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు పరిశీలిస్తారన్నారు. ఈనెల 18న యాజమాన్యాలు సీట్లు కేటాయిస్తాయన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 18 నుంచి 20 వరకు సంబంధిత డైట్ కళాశాలలో రిపోర్టు చేయాల్సింటుందని ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి



మాట్లాడుతున్న తిరుపతి

విద్యారణ్యపురి: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, ఇప్పటికైనా ఆ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 6,7 తేదీల్లో జిల్లాకేంద్రంలో నిర్వహించబోతున్న రిలే నిరసన దీక్షలు, ఈ నెల 9నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మెకు తమ సంఘం మద్దతు తెలుపుతుందన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్రకార్యదర్శి రావుల రమేశ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి గొడిశాల రమేశ్, బాధ్యులు ఇప్పకాయల కుమారస్వామి, ఎస్. అన్నారెడ్డి, మహ్మద్ అబ్జల్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌కు కన్నీటి వీడ్కోలు..

- ముగిసిన ఎస్సై అంత్యక్రియలు
- శోకసంద్రంగా వెంకటేశ్వర్లపల్లి
- బాధిత కుటుంబీకులకు భూపాలపల్లి ఎమ్మెల్యే, ములుగు ఎస్పీ పరామర్శ



హరీశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలో వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య ముగిశాయి. హరీశ్‌ను కడసారి చూసేందుకు గ్రామంతో పాటు చుట్టూ పక్కల ప్రజలు, బాల్యమిత్రులు, సహచర ఎస్సైలు పెద్ద ఎత్తున గ్రామానికి చేరుకున్నారు. పది రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సిన కొడుకు జిల్లేడ్ చెట్టుతో పెళ్లి చేస్తుంటే తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మరోవైపు హరీశ్ తల్లి మల్లికాంబ.. 2020 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలు, తన కొడుకు మిత్రులను పట్టుకుని గుండెలవిసేలా రోదించింది. అంతిమయాత్రలో బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు పాల్గొని కన్నీటి పర్యంతమయ్యారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ములుగు ఎస్పీ శబరీశ్ వేర్వేరుగా ఎస్సై హరీశ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ప్రశాంత్‌నగర్ చోరీ కేసు చేధన..

- చిన్న ఆధారంతో కూపిలాగిన పోలీసులు
- ఇద్దరి అరెస్ట్, రిమాండ్.
- 23 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఇటీవల దావ కిశోర్ ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు చేధించారు. తీగ లాగితే డొంక కదిలినట్లు చిన్న ఆధారంగా కూపిలాగిన పోలీసులు చోరీకి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. కిశోర్ భార్య ఆసుపత్రికి వెళ్లగా కిశోర్ పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకురావడం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. దీనిని గమనించిన హైదరాబాద్‌కు చెందిన సనాబేగం, సోహెల్ తాళం పగులగొట్టి 23 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. ఆ సమయంలో సీసీ కెమెరాలో రికార్డు అయిన ఓ వీడియోలో ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో కూడిన ఓ కారును పోలీసులు గుర్తించారు. అనుమానం కలగడంతో ఆ వాహన కదలికలపై నిఘా వేశారు. సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు నవీన్ కుమార్, లవన్‌కుమార్, సిబ్బంది భాస్కర్, విష్ణు.. ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి దర్గా కాజీపేటలో సంచరిస్తున్న నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, చిన్న ఆధారంగా చోరీ కేసును చేధించి నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపర్చిన పోలీసులను సీపీ అంబర్ కిశోర్ ఝాతో పాటు అధికారులు అభినందించారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దారుణ హత్య

- కారులో మృతదేహాన్ని రంగంపేటలో వదిలివెళ్లిన నిందితులు
- ఆర్థిక లావాదేవీలే కారణమా?



రాజమోహన్(ఫైల్)

రామన్నపేట : వరంగల్ కాశిబుగ్గకు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి వెలిగేటి రాజమోహన్(62) దారుణ హత్యకు గురయ్యారు. రాజమోహన్‌ను ఎక్కడ హత్య చేశారో.. ఏ కారణం చేత హత్య చేశారో తెలియదు కానీ.. అతడి కాళ్లను గొలుసులతో, చేతులను తాళ్లతో కట్టేసి తలపై తీవ్రంగా కొట్టి చంపారు. అతడి కారులోనే మృతదేహాన్ని పడేసి మంగళవారం ఉదయం 3.42 గంటల ప్రాంతంలో మట్టెవాడ పీఎస్ పరిధిలోని రంగంపేట ప్రాంతంలో ఓ వ్యక్తి వదిలేసి వెళ్లాడు. తెల్లవారుజామున అటుగా వెళ్తున్న స్థానికులు కారులో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి కారు వదిలేసి వెళ్లిన విషయం గుర్తించారు. అనంతరం మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం పూర్తి చేశారు.

హనుమకొండలో నివాసం..

రాజమోహన్ కాకతీయ గ్రామీణ బ్యాంకులో విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యాడు. ప్రస్తుతం హనుమకొండ శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నాడు. మృతుడి సోదరుడు రాజగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, రాజమోహన్ హత్యకు భూ తగాదాలు లేదా వివాహేతర సంబంధాల కారణమా, ఆర్థిక కారణాలా అనే విషయం తెలియాల్సి ఉంది.

సోమవారం రాత్రి ఫోన్ స్విచ్చాఫ్

రాజమోహన్ సోమవారం సాయంత్రం నుంచి ఫోన్‌లో స్పందించకపోవడంతో కుటుంబీకులు, బంధువులు ఆందోళన చెందారు. రాత్రి 11 గంటల వరకు కాల్ చేసినా స్పందించలేదు. రాత్రి 11 గంటల తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. ఈ క్రమంలో కుటుంబీకులు మంగళవారం ఉదయం సుబేదారి పీఎస్‌లో ఫిర్యాదు చేసే క్రమంలో రంగంపేటలో మృతదేహం లభ్యమైనట్లు తెలిసింది. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు.

'సీఎం కప్'కు నమోదు ఇలా..

- ఏయే క్రీడలు.. ఎప్పుడెప్పుడంటే?
- వివరాలు వెల్లడించిన హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్



వరంగల్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న సీఎం కప్–2024లో పోటీల్లో మీరు పాల్గొంటున్నారా? అయితే మీ పేర్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోండి. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్ మంగళవారం ప్రారంభమైంది. ఈమేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలు ఏయే తేదీల్లో, ఏయే క్రీడలు జరుగుతాయనే వివరాలను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ వెల్లడించారు. గ్రామపంచాయతీ స్థాయిలో ఈ నెల 7, 8వ తేదీల్లో, మండల స్థాయిలో 10, 12వ తేదీల్లో , జిల్లా స్థాయిలో 16 నుంచి 21వ తేదీ వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు https:// cmcup2024. telangana.gov.inలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఓటీపీ లేకుండా అయితే https:// cmcup2024. telangana. gov.in/offlineregister/156లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ లింక్ ఈ నెల 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీ, పీడీలు క్రీడాకారుల వివరాలు పొందుపరచాలని సూచించారు.

గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడలు..

→ అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పంచాయతీ సెక్రటరీ, సభ్యులుగా స్కూల్ హెచ్‌ఎం, పీఈటీ, సీనియర్ క్రీడాకారుడు కొనసాగుతారు. కోఆర్డినేటర్‌గా ఎంపీడీఓ వ్యవహరిస్తారు.

మండల స్థాయిలో..

→ అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా.

మండల స్థాయి ఎంపిక పోటీలు..

→ బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్, ఉషు, జూడో, స్నూకర్ క్రీడాంశాల్లో మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్‌ఓ తెలిపారు.

→ ఈ పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా తహసీల్దార్, ఎంఈఓ లేదా గెజిటెడ్ హెచ్‌ఎం, ఎస్సై, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి, సీనియర్ క్రీడాకారుడు ఉంటారు.

జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ..

→ జిల్లా స్థాయిలో చాంపియన్‌షిప్ కోసం అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్ , ఉషు, జూడో, స్నూకర్ పోటీల్లో విజేతలకు చాంపియన్‌షిప్‌గా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేయనున్నారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు..

→ టేబుల్ టెన్నిస్, లాన్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, హాకీ, సెపక్‌తక్రా, కరాటే, రోయింగ్, స్క్వాష్, కనోయింగ్‌కాయాకింగ్, ఆట్యాపాట్యా, పవర్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో ఉంటుంది.

జిల్లా స్థాయి నిర్వహణ కమిటీ..

→ జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ కలెక్టర్ , వైస్ చైర్మన్‌గా సిటీ పోలీస్ కమిషనర్ , మున్సిపల్ కమిషనర్లు, కో–వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డీవైఎస్‌ఓ, సభ్యులుగా జిల్లా ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు, డీఈఓ, జీఎం ఇండస్ట్రీస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వ్యవహరించనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలు..

→ హనుమకొండ జిల్లా కేంద్రంగా సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం కొన్ని క్రీడలు కేటాయించింది. అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, సెపక్ తక్రా పోటీలు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా జరగనున్నట్లు డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

● చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి



రాష్ట్ర స్థాయి జూడో పోటీలను ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

రామన్నపేట : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని చాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవన్‌లో 68వ తెలంగాణ రాష్ట్ర పాఠశాల క్రీడల జూడో రాష్ట్ర స్థాయి పోటీలను మంగళవారం భారత జూడో సమాఖ్య కోశాధికారి బైరబోయిన కైలాశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు పంజాబ్‌లోని లూథియానాలో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐలయ్య, ఫిజికల్ డైరెక్టర్ మల్లయ్య, టెక్నికల్ అఫీషియల్ రామయ్య, రాష్ట్ర జూడో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు దుపాకి సంతోశ్ కుమార్, సీనియర్ జూడో కోచ్ బి. వీరస్వామి, కోచ్‌లు నాగరాజు, రాము, రమణ, హుసాన్, సాయిరామ్ యాదవ్, ఎస్. కుమార్, లింగమూర్తి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ పనుల తనిఖీ



డీజిల్‌షెడ్‌లో హెవీ రిపేర్ బేషెడ్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నిర్మాణ పనులను సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్ జైన్ మంగళవారం తనిఖీ చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కార్యాలయాలు, సర్క్యులేటింగ్ ఏరియా పనులను పరిశీలించారు. అనంతరం డీజిల్‌లోకోషెడ్‌లో తనిఖీలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ ల్యాబ్, ఎక్సెండ్ హెవీ రిపేర్ బేషెడ్‌ను ప్రారంభించారు. అధికారులతో సమావేశమై షెడ్ అభివృద్ధి, విస్తరణ పనులు తెలుసుకున్నారు. కాగా, డీజిల్‌షెడ్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌బ్రాంచ్ చైర్మన్ జానీవియా, సెక్రటరీ వేదప్రకాశ్ ఆధ్వర్యంలో డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సీనియర్ డీఓఎం సురేశ్‌రెడ్డి, సీనియర్ డీసీఎం బాలాజీ, కాజీపేట డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ వెంకటకుమార్, కాజీపేట ఎలక్ట్రిక్‌లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్‌కృష్ణసాయి, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

● పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి



రమ్య (ఫైల్)

సంగెం: వరకట్న వేధింపులకు ఓ వివాహిత బలైంది. ఈ ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటకు చెందిన బీరం మల్లేశం రెండో కూతురు రమ్య (23)ను సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన జుర్రు ప్రశాంత్‌కు ఇచ్చి 2021 సంవత్సరంలో వివాహం జరిపించారు. వివాహ సమయంలో వరకట్నం కింద అర ఎకరం భూమి, 4 తులాల బంగారం, రూ. 50వేల నగదును ముట్టజెప్పారు. ఈ దంపతులకు రెండున్నర ఏళ్ల కుమారుడు నిహాన్‌రాజు ఉన్నాడు. ఇటీవల ప్రశాంత్ వ్యాపారం చేస్తున్నానని, అప్పులు అయ్యాయని చెప్పి భార్య రమ్యను అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్నాడని పలుమార్లు ఫోన్‌లో తండ్రి మల్లేశంకు తెలిపింది. ఈ క్రమంలో భర్త వేధింపులు భరించలేక ఈ నెల 1వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.